రాగిజావ మాయం



పాఠశాలలు తెరిచి నెలన్నర అవుతోంది. కొత్త ప్రభుత్వం సర్కారు పాఠశాలలపై శీతకన్ను వేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థులు రక్తహీనతతో అనేక రకాల రుగ్మతలకు లోనై విద్యపై దృష్టి పెట్టలేకపోతున్నామని గుర్తించి పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకుంది. వారానికి మూడోరోజులు చిక్కీలు ఇవ్వడంతో పాటు బెల్లం, రాగిపిండితో తయారు చేసే రాగి జావను ఇవ్వడం ద్వారా అనేక మంది కాల్సియం,లోపాలను అధిగమించారు. ప్రస్తుతం రాగిజావ అందివ్వడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

అటకెక్కిన సాంకేతిక పాఠం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కార్ బడుల్లో వెలిగిన డిజిటల్ కాంతులు ఆరిపోతున్నాయి. టీడీపీ ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో కోట్ల రూపాలయలతో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ అలంకార ప్రాయంగా మారుతున్నాయి. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో వాటిని వినియోగించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● సర్కారీ స్కూళ్లకు..

ఎల్లో లుక్కు.. రెడ్ బుక్కు

● చతికిలబడిన చంద్రం మాస్టారు ● తెగబడిన లోకేషం సారు



సర్కారు మారింది. పాఠశాలల్లో ఆహారం రుచి మారింది. శుభ్రత కరువైంది. గుడ్డు 'ఎగ్గొ'డుతున్నారు. అరగని పప్పు, ఉడకని బువ్వ తిని పిల్లలు 'పప్పూ'లా మారిపోతున్నారు. సురక్షిత లక్ష్యం 'నీరు'గారిపోతోంది. కొందరు మెల్లగా 'చిక్కి' శల్యమవుతూ వస్తుంటే.. మరికొందరు 'జావ'కారిపోతున్నారు. విద్యార్థులకు కానుక కొం'దరికే' చేరింది. అందరికీ ఇవ్వడానికి అస్మదీయులు 'కినుక' వహించారు. అమ్మ ఒడి కాస్తా తల్లికి దీవెన.. సారీ తల్లికి 'దండం' పెట్టే పథకంలా మారింది. చూస్తుండగానే చదువులమ్మ గుడిలో దీపం వెలుగు కొడిగడుతోంది. తరగతి గదులు సరిపడక, ఉన్న టీచర్లు సర్దుబాటు కాక సరస్వతి తనయలు మెల్లగా బడిబాట మరిచిపోయే పరిస్థితి వస్తోంది. చంద్రం మాస్టారు మేజిక్కులకు... చినబాబు జిమ్మిక్కులకు బడి చతికిలబడింది. మిర్రర్ ఇమేజ్ బుక్కులుండాల్సిన చోట కూడా 'రెడ్ బుక్కు' నోట్స్ మెల్లగా అమలవుతున్నాయి. విద్యావలంటీర్లపైనా పసుపుదండు దండెత్తుతోంది. గత ప్రభుత్వం విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చి ప్రపంచ విజేతలుగా నిలపాలని ప్రయత్నించగా, కూటమి సర్కారు విద్యార్థులను ఓటమి బాటలో నడిపిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' నెట్‌వర్క్ ప్రత్యేక కథనం.



రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ ఎర్రపశెట్టిపల్లిలో ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాల

రాయచోటి: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు పూర్తి కావస్తున్నా భావితరాలకు దిక్సూచిగా నిలిచే విద్యార్థుల భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వలేకపోయింది. మూడు నెలలుగా విద్యార్థులు తరగతి గదుల్లో ఆధునిక విద్య కోసం పరితపిస్తున్నా వారికి అందాల్సిన ప్రాథమిక అవసరాలైన పుస్తకాలు, ఆరోగ్యకరమైన భోజనం, తాగునీరు కరువై, చదువులు చెప్పే ఉపాధ్యాయుల కొరత వారి పాలిట శాపంగా మారింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చెప్పాడంటే.. చేస్తాడంతే.. అనే మాట అందరి నోళ్లలో నానిన విషయం పచ్చి నిజం. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం జగనన్న పాలనలో కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఫలితంగా పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యను అందుకున్నారు. ప్రభుత్వ బడులకు మౌలిక వసతులు సమకూరుస్తూనే మరోవైపు పాఠశాలలకు చిన్నారులను పంపేందుకు అమ్మ ఒడి పథకం ద్వారా తల్లిదండ్రులను ప్రోత్సహించారు. అలాగే విద్యాకానుక పేరుతో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, బ్యాగు, నోట్‌బుక్స్, డిక్షనరీలు అందించి విద్యార్థులకు చేదోడుగా నిలిచారు. విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కోడిగుడ్లు, చిక్కీలు, రాగిజావా లాంటి వాటిని కూడా సరఫరా చేశారు. వీటన్నిటికీ నేడు బాబు పాలనలో చంద్రగ్రహణం పట్టిందని చెప్పవచ్చు. అమ్మ ఒడి పథకానికి సంబంధించి కూటమి సర్కార్ తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉన్నా అందిస్తామని చెప్పింది. ఇప్పటికీ అతీగతీ లేదు.



బాబు గారి మాటలకు అర్థాలే వేరులే..

ఎన్నికల్లో గెలవడం కోసం కూటమి ప్రభుత్వం అనేక రకాల హామీలతో పాటు సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన పథకాలకు, వాటిని నమ్మి ఓటు వేసిన వారికి కూడా శఠగోపం పెడుతోంది. ఆర్థిక సమస్య పేరుతో ప్రజలకు నిలువనా పంగనామాలు పెట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికప్పుడు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం సాధ్యం కాదంటూ బాబు చెబుతున్న మాటలు వింటుంటే ఏరు దాటేంత వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటాకా బోడి మల్లన్న అన్న సామెత గుర్తుకు తెచ్చేలా చేస్తోంది. 2014లోనూ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాగే అనేక హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిన ప్రస్తుత సర్కార్ మరోమారు ఇప్పుడు కూడా హామీలను మాయ చేసేలా కనిపిస్తుండటంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో కరోనా లాంటి సవాళ్లతో పాటు ఆర్థికమాంద్యం లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా క్యాలెండర్ ప్రకారం చెప్పిన విధంగా వైఎస్ జగన్ సర్కార్ ప్రకారం నెల నెలా పథకాలను ప్రజలకు అందించింది.

వైఎస్ జగన్ సర్కార్‌లో అమ్మ ఒడికి సంబంధించిన వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2022-23	1,57,292	235.93
2023-24	1,52,366	228.54

విద్యాకానుక 75435 మందికి రూ.78 కోట్లు

జగనన్న విద్యా దీవెన ద్వారా 31478 మందికి రూ.24.80 కోట్లు జమ

▶▶ బడి తెరిచినప్పటి నుంచి సమస్యలే..

జిల్లా వ్యాప్తంగా 1734 ప్రాథమిక, 162 ప్రాథమికోన్నత, 304 ఉన్నత పాఠశాలల్లో 1,54,789 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే జిల్లాలోని 136 జూనియర్ కళాశాలల్లో 28,050 మంది విద్యార్థులు ఉన్నారు. జూన్ 13 తర్వాత నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్నా ఇప్పటికీ వారి తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ చేయకపోగా ఎప్పుడు చేస్తారో కూడా తెలియని పరిస్థితి చూసి పలువురు లబోదిబోమంటున్నారు. ఇక విద్యాకానుక ఇప్పటికీ విద్యార్థుల దరి చేరలేదు. జిల్లాలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. పాఠశాలల ప్రారంభ సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా పడిపోయినట్లు ప్రభుత్వ ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేయాలి. విద్యా కానుక కింద అందజేసే నోటు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అందజేయాలి. ఏకోపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో అదనపు టీచర్‌ను ఏర్పాటు చేయాలి. మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడి తినలేని పరిస్థితులు ఉన్నాయి. –నరసింహ సర్వేపల్లి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మరుగుదొడ్లు నిర్మించాలి



ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులతో పాటు మౌలిక వసతులను కల్పించాలి. ముఖ్యంగా విద్యార్థులకు అవసరం మేరకు మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఉండాలి. పిల్లలు ఆడుకోవడానికి ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలి. వాటికి అనుగుణంగా క్రీడా వస్తువులను సమకూర్చాలి. అప్పుడే విద్యార్థులు అన్ని విధాలుగా రాణిస్తారు. – సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

టీచర్ల కొరత పరిష్కరించాలి



మదనపల్లె మున్సిపాలిటీలో టీచర్ల కొరత పరిష్కరించాలి. మున్సిపాలిటీలోనే 45 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. పాఠశాలలు ప్రారంభించి రెండు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు టీచర్ల సర్దుబాటు చేయలేదు. సమస్యను పరిష్కరించాలి. –పి.వెంకటరమణ, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి

» అరకొరగా యూనిఫాం..



రాయచోటిలో యూనిఫాం లేక సాధారణ దుస్తులతోనే పాఠశాలకు..

'ఇప్పటి వరకు యూనిఫాం దుస్తులు అంతంత మాత్రంగానే ఇచ్చారు. ఇంకా చాలా ఇవ్వాల్సి ఉంది. ఇచ్చినవి ఇప్పటికీ టైలర్ల వద్దే ఉన్నాయి. అందువల్ల విద్యార్థులు సాధారణ దుస్తుల్లోనే పాఠశాలకు వెళుతున్నారు. అమ్మకు వందనం పథకం డబ్బులు ఇంకా ఇవ్వకపోవడంతో పిల్లల ఖర్చుల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం'.. అంటున్నారు పలువురు తల్లిదండ్రులు.

» అన్నం వాసనొస్తోంది...తినలేకపోతున్నాం

'బడిలో వడ్డించే మధ్యాహ్న భోజనం వాసనొస్తోంది... అందుకే ఇంటి దగ్గర నుంచి క్యారీలు తెచ్చుకొని తింటున్నాము. కోడిగుడ్డు కూడా దుర్వాసన వస్తోంది. తినలేక వదిలేస్తున్నాం'.. అంటున్నారు రాయచోటిలోని డైట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.



ఉడికించిన కోడిగుడ్డు వాసన వస్తుండటంతో ఇలా చెత్తకుప్పపాలు..



రాయచోటి: ఇంటి దగ్గర నుంచి క్యారీ తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

» కూలేందుకు సిద్ధంగా పాఠశాల



రామసముద్రం మండలంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఎర్రపశెట్టిపల్లి పాఠశాల భవనం

రామసముద్రం మండలంలోని మాలేనత్తం పంచాయతీ ఎర్రపశెట్టిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ పాఠశాలలో 19 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడిపోయి విద్యార్థులపై రాలుతున్నాయి. వర్షం కురిస్తే పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిందే. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు, గొర్రెలు ఆవరణంలోకి వస్తున్నాయి. పిల్లలకు సరైన క్రీడా మైదానం లేదు.



పైపెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా ఎర్రపశెట్టిపల్లి పాఠశాల

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్న మయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఉమ్మడి కడప జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపికలు



ఉమ్మడి కడప జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

రాయచోటి (జగదాంబసెంటర్): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాపేటలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు పులివెందుల, జమ్మలమడుగు, వేముల, కొత్తపల్లి, రైల్వేకోడూరు, పుల్లంపేట, రాయచోటి, సుండుపల్లె, మైదుకూరు, కోడూరు, కోరకుంటపల్లి మండలాల నుంచి సుమారు 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జేసునాథ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, ఆర్గనైజర్, సెలక్షన్ సెక్రటరీ జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17, 18, 19 తేదీలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు గంగులయ్య, వివిధ పాఠశాలల పీడీ, పీఈటీలు రవీంద్రరాజు, సుబ్రమణ్యం, వెంకటరమణ, రవీంద్రనాథరాజు, అబ్దుల్‌కరీం, గంగాశిరీష, చంద్రావతి, నీలకంఠ, సీనియర్ క్రీడాకారులు నాగార్జున, శ్రీను, కార్తీక్, శివ పాల్గొన్నారు.

శ్రీరస్తు.. శుభమస్తు!

ప్రారంభమైన పెళ్లి సందడి

మదనపల్లె సిటీ: అంతటా పెళ్లి సందడి కనిపిస్తోంది. ఎక్కడ చూసినా పచ్చని పందిళ్లు.. మామిడాకుల తోరణాలు.. కళ్లు మిరుమిట్లు గొలిపే సెట్టింగులు.... రంగురంగుల విద్యుత్‌దీప కాంతులు, సన్నాయి మేళాల స్వరాలు,, ఆత్మీయ పరిమళాలు.. అనుబంధాల కమ్మదనంతో పాటు కల్యాణ వేదికలు కళకళలాడుతున్నాయి. మూడుముళ్ల బంధంతో ఇద్దరు ఒక్కటయ్యే శుభఘడియలు.. రెండు కుటుంబాల మధ్య అనుబంధాలు పెనవేసుకునే ఘట్టాలకు పెళ్లి అనే సందడి రానే వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహూర్తాలు లేక ఇన్ని రోజులూ శుభ కార్యాలకు బ్రేక్ పడింది. ఈనెల 5వతేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండటంతో 5 నుంచి వివాహాది శుభ కార్యాలు మొదలవనున్నాయి.

జిల్లాలో పెళ్లి సందడి ప్రారంభం

పెళ్లి శుభలేఖలు, కల్యాణమండపాలకు అలంకరణలు, కొత్త దుస్తులు కొనుగోళ్లతో షాపింగ్ మాల్స్ కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేటలతో పాటు అన్ని మండల కేంద్రాల్లో పెళ్లి వాతావరణం కన్పిస్తోంది.



పెళ్లికి సిద్ధమైన వివాహ వేదిక

పట్టుచీరలు, బంగారం కీలకం: పెళ్లిళ్లలో ప్రధానమైనది పట్టుచీరలు, బంగారం. తాళిబొట్టు నుంచి నిలువెత్తు వరకు స్థాయిని బట్టి బంగారాన్ని వాడుతుంటారు. బంగారం ఖరీదు పెరుగుతున్నా వ్యాపారం మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో ప్రధానంగా రాయచోటి, మదనపల్లెలో బంగారు దుకాణాల్లో కొనుగోలు సందడి నెలకొంది. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె పట్టు చీరలకు నిలయం. వివాహాలకు పట్టుచీరల కొనుగోలుతో షాపులు కళకళలాడుతున్నాయి. వరుడికి కట్నం కింద ఇచ్చే కానుకల దుకాణాల్లోనూ సందడి నెలకొంటోంది.

▶▶ వివాహ ముహూర్తాలు

ఆగస్టు: ,7,9,10,11,15,17,18,19, 22, 23,24,26,28,29,30,31

మేకప్ నుంచి భజంత్రీల వరకు...

పెళ్లంటే ఓ సందడి. నోరూరించే వంటలు, మేకప్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, పురోహితులు, బాజాభజంత్రీలతో పాటు ఇంకా ఎన్నో వర్గాల వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేతి నిండా పని దొరికింది. ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో వారికి కాస్త ఊరట కలిగినట్టయింది.

వివాహాలు ఎక్కువ జరుగుతాయి

ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో ఎక్కువ వివాహాలు జరుగుతాయి. ఈనెల 5 నుంచి 31 వరకు ముహూర్తాలున్నాయి. వచ్చే నెల సెప్టెంబర్ నెలలో ముహూర్తాలు లేవు. దీంతో చాలా మంది ఈనెలలోనే వివాహాలు జరిపించనున్నారు. –శివకుమార్‌శర్మ, వేదపండితులు, మదనపల్లె

భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్యస్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వాముల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పల్లకీలో ఉంచి మాఢవీధులలో ఊరేగించారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

పెండ్లిమర్రి : మండలంలోని గోపరాజుపల్లె గ్రామానికి చెందిన బైరేష్, ఈశ్వరయ్య, గణేష్ గ్రామానికి సమీపంలో గొర్రెల మందను కట్టివేశారు. రాత్రి కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెలు చనిపోయాయి. మరిన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. దాదాపు రూ.1.50 లక్షల నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరారు.

శతాధిక వృద్ధురాలు మృతి



పోచన శివమ్మ (ఫైల్)

రాజుపాళెం : మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పోచన శివమ్మ(103) ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెల సంతానంకాగా, ఒక కుమార్తె, ఒక కుమారుడు మృతిచెందారు. ప్రస్తుతం 16 మంది మనువళ్లు, మనువరాళ్లు ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న శివమ్మ నెల కిందట కోతిని తరిమే క్రమంలో ప్రమాదవశాత్తూ కింద పడ్డారు. అప్పటి నుంచి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆదివారం మృతిచెందారు. రాగి సంగటి, కొర్ర సంగటి తినడం వల్లే ఇన్ని రోజులుగా శివమ్మ జీవించారని గ్రామస్థులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి





లక్ష్మీసునీత(ఫైల్), పరిశీలిస్తున్న ఎస్‌ఐ

ఎర్రగుంట్ల : మండల కేంద్రమైన యర్రగుంట్ల పట్టణంలోని ప్రకాశ్ నగర్ కాలనీలో నివాసముండే ఎం.లక్ష్మీ సునీత(32) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి వివరాల మేరకు.. మోపూరి నరసింహులు, లక్ష్మీ సునీత దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఆదివారం ఇంట్లో లక్ష్మీ సునీత అనుమానాస్పదంగా మృతి చెంఆరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంటి సామగ్రి

నందుపల్లె : మండల కేంద్రంలోని వినాయక నగర్‌లో నివాసముంటున్న కార్పెంటర్ రెడ్డప్పఆచారి(బాబు) ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం రెడ్డప్ప ఆచారి కార్పెంటర్ పనులకు వెళ్లారు. ఆయన సతీమణి కంటి పరీక్షల కోసం రాయచోటికి వెళ్లారు. ఈ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బీరువాలో ఉన్న రూ.1.5 లక్షల నగదు, దుస్తులు, కూలర్, ఇతర సామగ్రి కాలిపోయాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరారు.

భారత సంచార్ భళా

- మొబైల్ చార్జీల పెంపుతో బీఎస్ఎన్ఎల్‌పై జనం ఆసక్తి
- ఇతర నెట్‌వర్క్‌ల నుంచి పోర్ట్ అవుతున్న వినియోగదారులు
- జిల్లా వ్యాప్తంగా మరో 46 సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు

ప్రైవేట్ టెలికాం కంపెనీలు టారిఫ్ పెంచిన నేపథ్యంలో వినియోగదారులు భారత సంచార్ భళా అంటున్నారు. బీఎస్ఎన్ఎల్ వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రైవేట్ టెలికాం కంపెనీల కన్నా రీఛార్జిల భారం బీఎస్ఎన్ఎల్‌లో బాగా తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. దీనికి తోడు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చాలామంది బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : టెలికాం రంగంలో ప్రైవేట్ సంస్థల ధాటికి తట్టుకోలేక తమ ప్రాభవాన్ని కోల్పోయిన బీఎస్ఎన్ఎల్ సంస్థ రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ తన ఉనికిని చాటుతోంది. ప్రైవేట్ సంస్థల టారిఫ్ ధరలు విపరీతంగా పెంచిన నేపథ్యంలో ఆకర్షణీయమైన ప్యాకేజీలతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. వైఎస్ఆర్ జిల్లాలో బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అవుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో 2జీ, 3జీ కలుపుకొని ఇప్పటి వరకూ మొత్తం 460 టవర్లు ఉన్నాయి. వీటికి తోడు మరో 46 టవర్లు కొత్తగా ఏర్పాటుచేసి వాటన్నింటినీ 4జీ పరిధిలోకి తీసుకురానున్నారు. ఇప్పటి వరకూ 1000 ల్యాండ్‌లైన్, 6300 బ్రాండ్ బాండ్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటినీ ఫైబర్ కనెక్షన్‌గా మార్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఆప్టికల్ ఫైబర్‌తో వినియోగదారులకు నాణ్యమైన అంతర్జాల సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సిద్ధమైంది.



కడపలో బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం

టారిఫ్ వార్‌తో మంచి రోజులు

టెలికాం రంగంలో దిగ్గజ సంస్థలన్నీ టారిఫ్‌లు ఇటీవల గణనీయంగా పెంచాయి. ఈ నెల మొదటి వారం నుంచి కొత్త రీఛార్జి రేట్లు అమలులోకి రావడంతో ఆయా కంపెనీల వినియోగదారులు ఈ భారం మోయలేకపోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ తీసుకున్న నిర్ణయం ఆ సంస్థకు ఊపిరి పోసినట్లయింది. కేవలం రూ. 200 రీఛార్జితో వినియోగదారులను తనవైపు తిప్పుకుంది. గత 20 రోజుల వ్యవధిలోనే 5 వేల మంది బీఎస్ఎనల్‌కు పోర్ట్ అవడం ఇందుకు అద్దం పడుతోంది.

అన్నింటినీ అధిగమిస్తాం



ప్రైవేట్ టెలికాం సంస్థలు మొబైల్ ఛార్జీలు విపరీతంగా పెంచి వినియోగదారులపై మోయరాని భారం మోపాయి. బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రజలకు అండగా నిలవాలనుకుంది. అందుకే వారిపై భారం పడకుండా ఆకర్షణీయమైన ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చాం. నెలకు కేవలం రూ.200తో రీచార్జ్ 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ అందిస్తున్నాం. మా సంస్థ వైపు మొగ్గు చూపుతున్న వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. అన్ని సమస్యలు అధిగమించి డిసెంబర్ నెలాఖరుకు 4జీసేవలు అందుబాటులోకి తెస్తాం.

– షేక్ ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్, వైఎస్ఆర్ జిల్లా

20న రెవెన్యూ భూ బాధితుల సమావేశం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మదనపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భూ ఆక్రమణలు జరిగినట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నెల 20న విజయవాడలో రెవెన్యూ భూ బాధితుల సమావేశం ఏర్పాటు చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అధ్యక్షతన మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన భూ బాధితులలో రామకృష్ణ మాట్లాడుతూ..రాజకీయ పలుకుబడితో లాక్కున్న తమ భూములు ఇప్పించాలని బాధితులు మదనపల్లె సబ్ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతుండటం బాధాకరమన్నారు. భూ బాధితులందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ కబ్జాదారులు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, రాజకీయ అండదండలతో వేయి ఎకరాలకు పైగా కబ్జా చేసి మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రికార్డులు దగ్ధం చేశారన్నారు. కలెక్టర్ గిరీషాపైనా విచారణ జరపాలని ఆయన కోరారు. అనంతరం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లెలో భూ బాధితుల సమస్యలపై వినతులు ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, మహేష్, కృష్ణప్ప, సాంబశివ, మనోహర్‌రెడ్డి, కే.మురళి, మాధవ్ పాల్గొన్నారు.

రైతులకు వరం.. వైఎస్సార్ జలాశయం

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



నీటిని వదులుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు : జిల్లాలోని రైతులకు తాగు, సాగు నీరు అందించే వైఎస్ఆర్ జలాశయం వరప్రసాదమని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. అధికారులు, నాయకులతో కలిసి వెలిగల్లు రిజర్వాయర్ కుడి కాల్వ గేట్లు ఎత్తి ఆదివారం దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డిలు ప్రాజెక్టులు కట్టడంతో నేడు ఈ ప్రాంతంలో అందరికీ ఉపయోగపడుతున్నాయన్నారు. 4.64 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకు 2.77టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారన్నారు. 30 క్యూసెక్కుల నీటిని మూడు నెలల పాటు కాల్వకు వదిలితే రైతులకు ఎంతో ఉపయోగం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శిరీష్‌కుమార్, మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెట్టును ఢీ కొన్న ఆటో: ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ : ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లెలో ఆదివారం జరిగింది. పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన మల్లికార్జునతో పాటు అశ్విని, అరుణ పెద్దమండ్యం మండలం వెలిగల్లుకు వెళ్లారు. తిరిగి ఆటోలో మదనపల్లెకు వస్తుండగా దుబ్బిగానిపల్లె వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో అశ్విని, అరుణలకు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

స్కూటరిస్టుకు..

పెద్దతిప్పసముద్రం మండలం పుల్రవాండ్లపల్లెకు చెందిన రామచంద్ర(60) ఇంటికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్ర తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండంతో తిరుపతికి రెఫర్ చేశారు.

నగదుతో కర్ణాటక డ్రైవర్ పరారీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కొండప్ప నాయుడు

కురబలకోట: కర్నాటక డ్రైవర్ దారి దోపిడీ డ్రామాను ముదివేడు పోలీసులు ఛేదించారు. అంగళ్లు ఓపీ స్టేషన్‌లో డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. కర్నాటకలోని శ్రీ రాఘవేంద్ర ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమలో తయారయ్యే వాటిని కర్నాటకలోని అయ్యంగార్ బేకరీకి తీసుకెళ్లి విక్రయించేవారు. డ్రైవర్ వెంకటేష్‌తో పాటు సేల్స్‌మెన్ ఉండేవారు. గత నెల 23న పొద్దుటూరు, బద్వేల్, పోరుమామిళ్ల, కడపలో సరుకులను బేకరీలకు డెలివరీ చేశారు. రూ.1.50 లక్షల కలెక్షన్ వచ్చింది. దీంతో తిరిగి కర్నాటకకు బయలు దేరారు. మండలంలోని ముదివేడు టోల్‌గేట్ దాటిన తర్వాత వీరి వాహనానికి ఎదురుగా మరో కారును అడ్డుపెట్టారు. నలుగురు వ్యక్తులు కారు దిగి సేల్స్‌మెన్, డ్రైవర్ వెంకటేష్‌ను బెదిరించి వారి నుంచి రూ.1.5లక్షలు లాక్కెళ్లారు. ఫుడ్ ప్రొడక్ట్స్ వాహన డ్రైవర్ వెంకటేషను వారి వెంట కారులో తీసుకెళ్లిపోయారు. దీనిపై నిర్వాహకుడు మధు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారించిన పోలీసులు డ్రైవర్ వెంకటేష్ ఈ డ్రామా ఆడించినట్లు తెలుసున్నారు. డ్రైవర్ వెంకటేష్ (25)తో పాటు మురళీధర్ (29), గిరిష్ (30), నాగరాజు (29)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు ఛేదించిన కానిస్టేబుళ్లు సుధాకర్,రవి నాయక్‌కు నగదు రివార్డు ఇవ్వనున్నారు.

అవినీతి, అక్రమాల సీఐ మాకు వద్దు

హోం మంత్రికి అబ్బూరు శ్రీనివాసులు వినతి

రైల్వేకోడూరు అర్బన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ కె.హేమసుందర్‌రావును రైల్వేకోడూరుకు నియమించడాన్ని పునరాలోచించాలని ఓబనపల్లె వాసి అబ్బూరి శ్రీనివాసులు చౌదరి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు విన్నవించారు. ఈ మేరకు ఆయన మంత్రికి వినతిపత్రం అందజేశారు. లేఖలో ప్రస్తావించిన వివరాలిలా.. కె.హేమసుందర్‌రావు రైల్వేకోడూరు మండలం ఓబనపల్లెలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వాసి అని లేఖలో తెలిపారు. తన భార్య, బంధువులతో కలిసి ఓబనపల్లెలో బలహీన వర్గాల భూములను దౌర్జన్యంగా లాక్కుని వారిని బెదిరించిన సందర్భాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో ఇతనిపై ఆరోపణలు వచ్చినా తన అధికార బలంతో ఇబ్బందులు రాకుండా చూసుకున్నాడన్నారు. ఇక్కడ పోస్టింగ్ లేని సమయంలోనే పోలీసు జులుం ప్రదర్శించి, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడిన అతన్ని ఇప్పుడు రైల్వేకోడూరు సీఐగా నియమిస్తే భూ తగాదాలు పెరుగుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతుందన్నారు. సీఐగా పోస్టింగ్ కోసం తమ కులాన్ని వాడుకొని టీడీపీ నాయకుల అండతో కోడూరుకు పోస్టింగ్ వేయించుకున్నారన్నారు. గతంలో కోడూరు ఎస్ఐ, మన్నూరు సీఐగా ఉంటూ అడ్డగోలు వ్యవహారాలు నడిపారన్నారు. భూ వివాదాల విషయంలో కోర్టుకు వెళ్లారన్నారు. ఆ వ్యక్తిని కోడూరు ప్రాంతంలో సీఐగా అవకాశం ఇస్తే కోడూరులో బలహీనుల భూములకు రక్షణ ఉండదన్నారు. మరో ప్రాంతానికి బదిలీ చేయాలని వారు కోరారు.

ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ



నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కమ్మవారిపల్లి క్రాస్ రోడ్డులో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లికి చెందిన రామచంద్ర(58), డి.నారాయణపల్లికి చెందిన వెంకటరమణ(65) ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. మరో వాహనంలో ఎల్లమందకు చెందిన బీబీ జాన్ (30), సాధిక్(32) వెళ్తున్నారు. మండలంలోని కమ్మవారిపల్లి క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పీటీఎం కానిస్టేబుళ్లు బావాజాన్, భద్ర ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

అడవిలో జంట మృతదేహాలంటూ ప్రచారం



అడవిలో కళేబరాలు పరిశీలిస్తున్న పోలీసులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని మొటుకు అడవిలో జంట మృతదేహాలు పాతిపెట్టారనే ప్రచారం కలకలం రేపింది. ఇసుక తోడి మృతదేహాలను పాతిపెట్టారని సమాచారం అందడంతో పోలీసులు పరుగులు తీశారు. తీరా అక్కడికి వెళ్లి పరిశీలించగా దూడల కబేళాలని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని మొటుకుపల్లె పంచాయతీ టేకులపెంటకు మూడు కిలోమీటర్ల దూరంలో రోడ్డు పక్కన అడవిలో ఇసుక దిబ్బలోంచి బయటకు వచ్చిన ఓ కళేబరాన్ని కుక్కలు పీక్కుతింటున్నాయి.. దాని పక్కనే మరో సమాధి ఉంది.. వాహనం వెళ్లిన గుర్తులు ఉన్నాయంటూ ప్రచారం దావానలంలా పోలీసులకు చేరింది. ఇది తెలుసుకున్న ఏఎస్ఐ బొజ్జినాయక్, పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆవు చర్మంగా నిర్ధారణ కావడంతో.. మానవ మృతదేహం కాదని తేల్చారు. పక్కనే ముళ్లకంపలు వేసిన చోట మట్టి తొలగించి చూడగా దూడ కళేబరం ఉన్నట్లు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. మొటుకుపల్లె పంచాయతీ పులుసుమానిపెంట, బండమీద గొల్లపల్లెల్లో దీనిపై విచారించారు. ఓ విద్యా సంస్థ సిబ్బందిని విచారించగా ఇటీవల తమవద్ద దూడ చనిపోవడంతో పాతిపెట్టి ముళ్ల కంపలు వేసినట్లు పోలీసులకు తెలిపారు. కొన్ని గంటల పాటు ఉత్కంఠ వీడడంతో పోలీసులు వెనుదిరిగారు.

బైక్‌లకు నిప్పు పెట్టిన దుండగులు



పూర్తిగా కాలిపోయిన బైక్‌లు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ద్వారకా నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రెండు బైక్‌లకు నిప్పు పెట్టారు. పోలీసుల వివరాల మేరకు.. రఘురాముడు తమ బైక్‌లను శనివారం రాత్రి ఇంటి ఎదుట పార్క్ చేశారు. ఆదివారం ఉదయం రెండు బైక్‌లు కాలిపోయాయి. బాధితుడు రఘురాముడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేవీకేలో నేడు, రేపు స్వర్ణోత్సవ వేడుకలు

– కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవ వేడుక నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఈ నెల 5, 6వ తేదీలలో స్వర్ణోత్సవ వేడుకల టార్చ్‌ను రెండు రోజులపాటు ప్రదర్శించడంతోపాటు, రైతులకు శిక్షణ కార్యక్రమలు, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డ్రోన్లతోపాటు పోషకాల పిచికారీ, వ్యవసాయంలో సౌర శక్తి వినియోగం, వ్యవసాయంలో యాంత్రీకరణపై శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రైతు సోదర, సోదరీమణులు పాల్గొని విజయవంతం చే యాలని కోరారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ మస్తాన్

దువ్వూరు : మండలంలోని దాసరిపల్లె అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు మైదుకూరు అర్బన్ సీఐ మస్తాన్ తెలిపారు. దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడుతూ దువ్వూరుకు చెందిన అవిలి పోలయ్య, తమిళనాడుకు చెందిన వేలాన్ మణి, రాజన్ ఆదివారం తెల్లవారుజామున దాసరిపల్లె అటవీ ప్రాంతంలోని తెలుగుగంగ కాలువ వద్ద తొమ్మిది ఎర్రచందనం దుంగలు రవాణా చేస్తూ కనిపించారు. వారిని అరెస్టు చేసి ఐదు గొడ్డళ్లు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక హోండా సిటీ కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ముగ్గురిని అరెస్టు చేసి తిరుపతి ఎర్రచందనం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వెంకటరమణ

మదనపల్లె సిటీ : అప్పుల బాధ తాళలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కురబలకోట మండలం ముదివేడు పంచాయతీలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పడమటి హరిజనవాడకు చెందిన మారప్ప కుమారుడు వెంకటరమణ(35) ఒకవైపు వ్యవసాయం మరో వైపు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతడికి భార్య పరిమళ, కుమార్తెలు నిత్య, నిఖిత, నిరేషన్‌లు ఉన్నారు. వ్యసాయంలో గిట్టుబాటు కాకపోవడంతో ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని నడుపుతున్నాడు. ఆటో మరమ్మతులకు గురై ఆగిపోయింది. అయితే అప్పులు కట్టాలని రుణ గ్రహీతలు ఒత్తిడి చేయడంతో మనస్థాపానికి గురై ఆది వారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తిరింపులతో.. మామిడి సిరులు

- గాలి, వెలుతురు ఉంటేనే పంట దిగుబడి అధికం
- ఎరువుల యాజమాన్యానికి సాయం అందని వైనం

పండ్లల్లో రారాజు మామిడి పండు. మామిడి ప్రియులు దేశ విదేశాల్లోనూ ఎదురుచూస్తుంటారు. ఇప్పటి నుంచే మామిడి రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించకపోతే నష్టాలు చవిచూడాల్సిందేనని ఉద్యాన అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆగస్టు చివరికల్లా ముదురు మామిడి చెట్లల్లో కత్తిరింపులు పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

లక్కిరెడ్డిపల్లె : అన్నమయ్య జిల్లాలో పెద్ద ఎత్తున మామిడి తోటలు ఉన్నాయి. ఆయా తోటల్లో ఆగస్టు చివరికి కత్తిరింపులు పూర్తి చేస్తే కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి దిగుబడులు పెరుగుతాయని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ చివరికి ఎరువుల యాజమాన్యం పూర్తిచేసి తోటల్లో గాలి, వెలుతురు ఉండేలా చూసుకుంటే లాభాలు గడించవచ్చునని పేర్కొంటున్నారు. పదేళ్లు దాటిన మామిడి చెట్లకు కొమ్మల కత్తిరింపులు చేసుకొని, ఎండు పుల్లలు కాల్చివేస్తే పురుగు నాశనమై చెట్టుకు చీడ, పీడలు రాకుండా ఉంటాయని చెబుతున్నారు. చాలామంది కత్తిరింపులు చేయక దిగుబడి తగ్గిపోతోందన్నారు.



అప్పలరాజుగారిపల్లె వద్ద ముదురు మామిడి తోటల్లో కత్తిరిస్తున్న రైతు

యజమానులకు సూచనలివీ..

- చెట్టుకున్న 15 శాతం ఆకులకు మాత్రమే సూర్యరశ్మి తగులుతుంది. మిగిలిన 85 శాతం ఆకులకు తగలకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. చెట్టుకు అవసరమైన ఆహారం కిరణజన్య సంయోగ క్రియ ద్వారానే జరుగుతుంది.
- ఎండిన కొమ్మలు తొలగించడంతోపాటు కాయ తీసిన అనంతరం కాండాలను తొలగిస్తే రోగాలను నివారించవచ్చు.
- చెట్టుకు రెండు కిలోల యూరియా, ఐదు కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1500 గ్రాముల పొటాష్ , వంద కిలోల పశువుల ఎరువు వేసి దిగుబడులు పొందవచ్చు.
- ఆగస్టు మొదటి వారంలో మామిడి తోటల్లో జీలుగ, పెసర, అలసంద, ఉలవ పంటలు సాగు చేసి పూత దశకు వచ్చినప్పుడు ట్రాక్టర్‌తో మిల్లర్ కొట్టి.. పచ్చిరొట్ట ఎరువు అందించవచ్చు.
- సూక్ష్మ పోషక పదార్థాలైన జింక్, బోరాన్, ఇనుము కలిగిన ఫార్ములా–4ను లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేస్తే దిగుబడులు సాధించే అవకాశం ఉంది.
- సెప్టెంబరు కల్లా చెట్టు వద్ద దుక్కులు పూర్తి చేయాలి. అక్టోబరు, నవంబరు మాసాల్లో దుక్కులు చేయరాదు. ఆ సమయంలో నీరు వేయకూడదు.
- 10 నుంచి 20 ఏళ్లలోపు మామిడి చెట్లకు ఎరువులు వాడకం మొదలు పెట్టాలి. చెట్టుకు రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సూపర్, రెండు కిలోల ఎంపీపీ(పొటాష్) కలిపి తొలి విడతగా జూలై, ఆగస్టు మాసాల్లో, రెండో విడతగా నవంబర్‌లో వేస్తే దిగుబడులు వస్తాయి.
- ఎరువులు వేసిన తోటలకు నెలకు రెండు తడుల నీరందిస్తే చెట్టు ఇగురు బాగా వచ్చి నవంబరు కల్లా పూతమొగ్గ ఏర్పడే అవకాశం మెండుగా ఉంది.

ఆగస్టులో చెట్ల కత్తిరింపులు చేసుకోవాలి



ఆగస్టులో మామిడి చెట్లలో కత్తిరింపులకు గతంలో రాయితీ ఇచ్చారు. ఎరువులు, రంపాలు, కత్తెరలు అందించారు. దీంతో మాకు కొంత మేర ఖర్చు తగ్గింది. ప్రస్తుతం మామిడి రైతులను ప్రభుత్వం పక్కన పెట్టేసింది. ఏటా ఖర్చుల భారం పెరిగిపోతోంది.

– శ్రీనివాసులు, రైతు, మద్దిరేవుల, లక్కిరెడ్డిపల్లె మండలం

రాయితీపై ఎరువులు అందించాలి



మామిడి రైతులకు ప్రభుత్వం రాయితీ ద్వారా హెక్టారుకు రూ.17వేలు అందించేది. ప్రస్తుతం పెరిగిన ఎరువుల ధరలకు అనుగుణంగా హెక్టారుకు రూ.30 వేలు అందించి రైతులను ఆదుకోవాలి. లేదంటే మామిడిపై రైతులు ఆశలు వదులుకోవాల్సి వస్తుంది.

– సుబ్బరాజు, రైతు, నరసింహరాజుగారిపల్లె, లక్కిరెడ్డిపలె

కత్తిరింపులు ఈ నెలలోనే చేసుకోవాలి

ఈ నెలలోనే పది నుంచి 20 ఏళ్లలోపు మామిడి చెట్లకు కత్తిరింపులు అవసరం. ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు సాధించవచ్చు. రైతులకు రాయితీ ద్వారా గతంలో రూ.1350తో పరికరాలు అందించాం. రైతులు కత్తెరలు, రంపాలు అడుగుతున్నారని జిల్లా అధికారులకు సమాచారం అందించాం.

– నాగమణి, ఉద్యానశాఖ అధికారి, లక్కిరెడ్డిపల్లె